క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఐనాల మైసయ్య సస్పెన్షన్ అయినట్లు మరిపెడ ఎంపీడీఓ విజయ శుక్రవారం తెలిపారు. ఎల్లంపేట ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణ నేపథ్యంలో గ్రామంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. నివేదికను డీఆర్డీఓ మధుసూదనరాజ్‌కు సమర్పించగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

అర్హులనే ఎంపిక చేస్తాం



దంతాలపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, వివిధ సంక్షేమ పథకాల్లో అర్హుల జాబితాను మాత్రమే ఎంపిక చేస్తామని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల, రామానుజపూరం గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఇంటిని పరిశీలించి పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ సూచన మేరకు అర్హుల జాబితా తయారు చేసి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పరిశీలనాధికారి సుగుణకర్, ఎంపీఓ అప్సర్‌పాషా పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వారికి జరిమానా

నెల్లికుదురు: గుడుంబా తయారుచేసి విక్రయించిన కేసులో బైండోవర్ ఉల్లంఘించిన వారికి జరిమానా విధించినట్లు తొర్రూర్ ఎక్సైజ్ ఎస్సైలు రవళి, శంకర్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బైండోవర్ ఉల్లంఘించిన నెల్లికుదురు మండలంలోని రామోజీతండాకు చెందిన భూక్య నీలమ్మ, గుగులోతు గోరు, భూక్య సరిత, నర్సింహులపేటకు చెందిన బొడ్డు సరితకు ఒక్కొక్కరికీ రూ.50 వేలు జరిమానా కింద రూ.2 లక్షల బ్రీచ్ పెనాల్టీ విధించినట్లు తెలిపారు.

పనిగంటల పెంపుతో కార్మికులపై భారం

తొర్రూరు: పని గంటల పెంపుతో కార్మికులపై భారం పడుతోందని టీయూసీఐ జిల్లా కోశాధికారి కె.సంపత్ అన్నారు. టీయూసీఐ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. సంపత్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 12 గంటల పని విధానం తీసుకురావడం సరికాదన్నారు. నాయకులు అర్వపల్లి వెంకన్న, మంగళపల్లి రామస్వామి, మురళి, శ్యామ్, యాకయ్య, నరేష్, ఎల్లయ్య, వెంకన్న, రాజులు పాల్గొన్నారు.

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్, మిట్టగడుపుల వెంకన్న, బండి రాజు, సూరయ్య, సారంగం, లాలు, మల్లయ్య, పర్వతాలు, శ్రీను, సంజీవ, సమ్మయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



మహబూబాబాద్ రూరల్ : కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని మహబూబాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నాయిని రంజిత్ అన్నారు. మండలంలోని ఇస్లావత్ తండా (ఎస్) గ్రామ పంచాయతీ పరిధిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ నాయని రంజిత్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మానుకోట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మురళి, మాజీ సర్పంచ్ బోడ లక్ష్మణ్, షరీఫ్, గంగుల శ్రీనివాస్, గుగులోత్ శశి, గుగులోతు రవి, బోడ రమేష్, బానోత్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నోరుతెరిచిన మోరీ..

- ప్రమాదకరంగా డ్రైయినేజీ
- అటువైపు వెళ్లాలంటేనే జంకుతున్న ప్రజలు, ప్రయాణికులు



మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులోని తొమ్మిది పోర్షన్స్‌కు వెళ్లే దారి మలుపు వద్ద ఉన్న డ్రెయినేజీ(మోరీ) ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం ఆదమరిచి వాహనం నడిపినా.. దానిలో పడే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పాద చారులు సైతం ఏమాత్రం చూడకుండా ఆ మూల మలుపులో నడిస్తే దానిలో పడే అవకాశం ఉంది. మోరీపై మున్సిపల్ అధికారులు స్లాబ్ నిర్మించకుంటే ప్రజలు, ప్రయాణికులు అందులో పడిపోయి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఆప్రాంతంలో ఎక్కువగా పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు వెళ్లే మార్గం కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

‘భూభారతి’తో భూసమస్యల పరిష్కారం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కేసముద్రం: భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని రైతువేదికలో భూభారతి నూతన చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ధరణిలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు లేవని, అదే భూభారతి చట్టంలో అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు దరఖాస్తులను పరిశీలించి, ఎవరి పరిధిలో ఉంటే వారే పరిష్కరించడం కోసం ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేని విధంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి, డీపీఓ విజయనిర్మల, ఏడీ సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, తహసీల్దార్ ఎర్రయ్య, ఎంపీడీఓ క్రాంతి, ఏడీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

సమస్యలు పరిష్కారం..

మహబూబాబాద్ రూరల్ : భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిస్కారం అవుతాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏటిగడ్డతండా రైతువేదికలో శుక్రవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు భూభారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మనిషికి ఆధార్ కార్డులాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపునకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని, దీనిద్వారా భూఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని స్పష్టం చేశారు. మే, జూన్ నెలలో పూర్తిస్థాయిలో భూభారతి చట్టం అమలులోకిరానుందని తెలిపా రు. అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, డీపీఓ విజయనిర్మల, ఏడీ సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, ఏడీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. పార్టీ జిల్లా స్థాయి విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం అజయ్‌సారథిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తుందని ఆరోపించారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో నేడు శాంతి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జూలై 5, 6 తేదీల్లో పార్టీ 3వ జిల్లా మహాసభలను కురవిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే డే వేడుకలను వాడవాడలా నిర్వహించాలన్నారు. అనంతరం ఆత్మ చైర్మన్‌గా ఎన్నికైన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డిని పార్టీ నాయకులు సన్మానించారు. సమావేశంలో కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, వెంకన్న, పాండురంగాచారి, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పేలుళ్లతో బతకలేకపోతున్నం



ఆందోళన చేస్తున్న తండావాసులు

నెల్లికుదురు: బాంబుల పేలుళ్ల శబ్దంతో బకలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని నల్లగుట్ట శివారు శ్రీవెంకటేశ్వర గ్రానైట్ వద్ద శుక్రవారం రాత్రి తండావాసులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా తండావాసులు అచ్చు నాయక్, వెంకన్న, శ్రీను, మోహన్, కల్యాణ్ మాట్లాడుతూ.. రేయింబవళ్లు బాంబులు పేలుస్తున్నారని తెలిపారు. బాంబుల మోతతో ఇళ్లు బీటలు వాస్తున్నాయని తెలిపారు. క్రషర్‌ను మూసేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని తండావాసులను శాంతిపజేశారు.

ఒకే ఒక్కడు..!



పరీక్షకు హాజరైన విద్యార్థి

మహబూబాబాద్ అర్బన్: ఓపెన్ టెన్త్ పరీక్ష రాసేందుకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో శుక్రవారం ఒకే ఒక విద్యార్థి హాజరయ్యాడు. ఆ విద్యార్థి పరీక్ష నిమిత్తం పరీక్ష కేంద్రం చీఫ్‌సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, సిట్టింగ్‌స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, సీసీ, ఇద్దరు ఇన్విజిలేటర్స్, పోలీస్, మెడికల్, ఇతర అధికారులు విధులు నిర్వహించారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నెహ్రూనాయక్



మౌనం పాటిస్తున్న నెహ్రూనాయక్, తదితరులు

కురవి: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకలు విచక్షణరహితంగా దాడి చేసి చంపడం దారుణమని, ఉగ్రవాదులను ఏరివేయాలని ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసిసోయేషన్) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బానోత్ నెహ్రూనాయక్ అన్నారు. శుక్రవారం సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండా గ్రామంలో ఉగ్రదాడి మృతులకు సంతాపంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంగ్యా, తండా పెద్దలు కేలోత్ అర్జున్ చౌహాన్, దేవేందర్, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు



కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తుందని డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బండి నర్సింహరావు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా డోర్నకల్‌లోని పలు కాలనీలతోపాటు తహసీల్దారు బంజర గ్రామంలో ఉపాధ్యాయ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా నర్సింహరావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు అనేక రకాల ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేసున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య, భోజనం, పుస్తకాలతోపాటు అనేక రకాల వసుతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శంకర్, మంజులత, శ్రీనివాస్, రాంనాయక్, రవికుమార్, జె.కమల తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లలను మా బడికి పంపించండి

మహబూబాబాద్ రూరల్ : తల్లులు, ఉపాధి హామీ కూలీలారా.. మీ పిల్లలను మా బడికి పంపించండి అంటూ మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయ బృందం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ బడి ఆవశ్యకతను వివరించి, ఆరుగురు పిల్లలను జాయిన్ చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇద్దయ్య, ఉపాధ్యాయులు విద్యాసాగర్, రమాదేవి, పూర్ణచందర్, కృష్ణయ్య, అనిత పాల్గొన్నారు.

సమాజసేవలో ఆర్యవైశ్యులు ముందుంటారు

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

మరిపెడ: ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుంటారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య జిల్లా మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా స్థానిక ఆర్యవైశ్య నూతన భవన నిర్మాణానికి సహకరించాలని కోరగా రాంచంద్రునాయక్ సానుకూలంగా స్పందించారు. అనంతరం జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా తల్లాడ వెంకటరామారావు, ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్, కోశాధికారి సామ రామ్మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరెల్లి సతీష్‌కుమార్, రీజియన్ అండ్ జోన్ చైర్మన్లు, మండల, అనుబంధ కమిటీలు, యువజన విభాగం, వాసవి సేవాదళ్ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, కార్యదర్శి వంగేటి అశోక్, మాజీ హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాసరావు, మచ్చ వెంకటనర్సయ్య, గోవర్ధన్, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, కె.ప్రసాద్, మధు, కాంతారావు, వేణు, శ్రీనివాస్, హరిప్రసాద్, పురుషోత్తం, వరప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

సన్మానం

గార్ల: అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన తల్లాడ వెంకటరామారావును శుక్రవారం గార్ల మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రావు, కామేష్, భాస్కర్, సత్యం, శ్రీనివాస్, సతీష్, విద్యాసాగర్, శ్రీనివాస్, కల్యాణ్, శ్రీకాంత్, నారాయణ, రంగారావు పాల్గొన్నారు.

అందరిని కలుపుకుని ముందుకెళ్లాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు: కులమతాలకు అతీతంగా అందరిని కలుపుకుని ఏకతాటిపై నడువాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఏఐసీసీ పిలుపులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీం, జైసంవిధాన్ అబియాన్ కార్యక్రమం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో బీజేపీ కులమతాల చిచ్చుపెట్టి విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, యాదవరెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ రోడ్‌లో పీడీఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ఎస్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బనిశెట్టి వెంకటేష్, విజయ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, రావుల మురళి, దస్రూనాయక్, వెంకన్న, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉప్పరపల్లి రోడ్డువైపు..

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధన్నసరి సొసైటీ డైరెక్టర్ రవిందర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ నెహ్రూరెడ్డి, నర్సయ్య, భద్రునాయక్, రాజేష్, శ్రీకాంత్, భీమా పాల్గొన్నారు.

మహబూబాబాద్‌లో పట్టపగలు చోరీ

- రూ.5 లక్షల నగదు, 3.07తులాల బంగారు ఆభరణాలు అపహరణ



దొంగలు తొలగించిన బీరువాల తలుపులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగి రూ.5 లక్షల నగదు, 3.07 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన శుక్రవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బానోతు శంకర్, పార్వతి దంపతులు జిల్లా కేంద్రం శివారులోని హైమా గార్డెన్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శంకర్ ఓ దినపత్రికకు ఏజెంటుగా పనిచేస్తుండగా పార్వతి స్థానిక స్పెషల్ యూపీఎస్ పాఠశాల సమీపంలో బట్టల షాపు నిర్వహిస్తోంది. రోజు మాదిరిగానే వారిద్దరూ ఉదయం తమ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో శంకర్ బంధువు ఒకరు వారి ఇంటి వైపుగా వెళ్తూ తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి, కుటుంబ యజమానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఇంట్లో పరిశీలించగా.. బీరువా తలుపులు తెరిచి ఉండడంతోపాటు సామాన్లన్నీ చిందరవందరంగా పడి ఉన్నాయి. ఇంట్లోని ఇనుప పెట్టెలోని రూ.5లక్షల నగదు, 3.07తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై శివ, ఫింగర్ ప్రింట్స్ బృందం సభ్యులు వచ్చి వివరాలు సేకరించారు. చోరీ ఘటనపై టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

సెల్‌టవర్‌కు భూ విరాళం

బయ్యారం: జగత్‌రావుపేటలో ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు చేయనున్న సెల్‌టవర్ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ చేపూరి మౌనిక తన స్వంతభూమిని విరాళంగా అందజేశారు. నూతన సెల్‌టవర్ ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలకు సమాచార వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

మలేరియాపై అవగాహన అవసరం

మలేరియాపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా సోకకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

–సాక్షి నెట్‌వర్క్



డోర్నకల్: మాట్లాడుతున్న డాక్టర్ సాధ్విజ



మరిపెడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యబృందం



గూడూరులో..

ఉగ్రవాదులను అంతమొందించాలి

- నల్ల బ్యాడ్జీలు ధరించి ముస్లింల నిరసన
- వివిధ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీలు

ఉగ్రవాదులను అంతమొందించాలని ముస్లిం మత పెద్దలు, వివిధ సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు అభిప్రాయపడ్డారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు, శాంతి ర్యాలీలు నిర్వహించా రు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి అమానుష చర్య అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: నిరసనలో పాల్గొన్న ముస్లింలు



మరిపెడలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు



కురవి: కాంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



తొర్రూరు: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చికిత్స పొందుతున్న యువతి మృతి

నర్సింహులపేట: నర్సింహులపేటకు చెందిన యువతి మర్రి అనూష(19) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై సురేష్, ఎస్‌హెచ్ఓ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేటకు చెందిన అనూషకు తల్లి రజిత ఇష్టం లేని పెళ్లి సంబంధం చూశారనే కారణంతో ఈ నెల 14వ తేదీన పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


వ్యక్తి ఆత్మహత్య

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్నారం గ్రామానికి చెందిన పోలెబోయిన నాగన్న(55) భార్య ఐదు నెలల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి నాగన్న మద్యానికి బానిసై మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో గురువారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగన్న కూతురు రాజబోయిన మౌనిక ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

బయ్యారం: రోడ్డుప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలకేంద్రంలోని పెట్రోల్‌బంక్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రాపురానికి చెందిన ధరావత్ శారద తమ కుటుంబసభ్యుల మోటార్‌సైకిల్‌పై పెట్రోల్‌కోసం బంకు వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుకనుంచి వచ్చిన మోటర్‌సైకిల్ ఢీ కొట్టడంతో శారదకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.


యువకుడి అదృశ్యం



కొత్త సందీప్

డోర్నకల్: శాంతినగర్‌కు చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్సై వంశీ ధర్ తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన కొత్త సందీప్ మాంసం మార్కెట్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఈనెల 23న రాత్రి ఇంటికి వచ్చి భోజనం చేసిన తర్వాత ఫోన్ వచ్చిందంటూ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం సందీప్ తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మిస్‌వరల్డ్ పోటీలను రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: ప్రపంచ సుందరీ 72వ అందాల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతమ్మ, పద్మ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్యభవన్‌లో పీఓడబ్ల్యూ రౌండ్ టేబుల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ, పద్మ మాట్లాడుతూ.. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా ఉంటున్న అందాల పోటీలను రద్దు చేయాల్సిందేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో భట్టు భిన్నమ్మ, పొన్నం రమ, బొల్లం సోమక్క, చిన్నం లక్ష్మీ, కవిత, తుడుం వీరభద్రం, భట్టు చైతన్య, బోనగిరి మధు, లాలు, శేషు తదితరులు పాల్గొన్నారు.

అత్తాకోడలు గొడవ.. మామ ప్రాణం తీసింది



లక్ష్మయ్య(ఫైల్)

బయ్యారం: నీటిపంపు దగ్గర నీళ్లు పట్టే విషయంలో అత్తాకోడలు మధ్య జరిగిన గొడవ మామ ప్రాణం తీసిన ఘటన మండలంలోని సింగారం(కొత్తపేట)లో జరిగింది. పోలీసుల కథకం ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన వట్టం లక్ష్మయ్య(79)కు ఐదుగురు సంతానం. ఈ నెల 12న నీటిపంపు దగ్గర నీళ్లు పట్టే విషయంలో లక్ష్మయ్య భార్య రాములమ్మ, రెండో కుమారుడు రామ్మూర్తి భార్య రాజమ్మ మధ్య గొడవ మొదలైంది. ఇది పెద్దది కావడంతో అడ్డుకోబోయిన లక్ష్మయ్యను కోడలు రాజమ్మ కర్రతో దాడి చేసి కొట్టింది. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మయ్య అదేరోజు అనారోగ్యానికి గురై ఇంటి వద్ద కిందపడటంతో తలకు బలమైనగాయం తగిలి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కోడలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.